- అధిక వర్షాలకు చేలల్లోకి చేరిన వరద
- చేతికొచ్చే పంట నీటిపాలైందని ఆవేదన
- దిగుబడి పడిపోయిందని దిగులు
- జిల్లాలో వారం వ్యవధిలో ముగ్గురు రైతుల ఆత్మహత్య

అన్నదాత విలవిల



భారీ వర్షాలకు నీట మునిగిన పత్తి (ఫైల్)



వర్షానికి దెబ్బతిన్న పత్తి (ఫైల్)

ఆసిఫాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించే రైతున్నకు ఏటేటా కష్టాలు తప్పడం లేదు. ప్రకృతి వైపరీత్యాలకు రైతన్నలు విలవిలలాడుతున్నారు. అతివృష్టి, అనావృష్టితో ఏటా ఏదో ఒక రూపంతో జిల్లా రైతాంగం అతలా కుతలమవుతుంది. ఏటేటా పంట సాగు ఖర్చులు పెరుగుతున్నప్పటికీ గిట్టుబాటు ధర లభించక పోవడంతో రైతాంగం తీవ్రంగా నష్ట పోవాల్సి వస్తుంది. దీంతో రైతులు అప్పుల పాలవుతున్నారు. ఈ ఏడాది వానాకాలం సీజన్ ప్రారంభంలో విత్తనాలు విత్తిన రైతన్నలు పంటల దిగుబడి పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఈసారైన పంటలు ఆశించిన స్థాయిలో పండుతాయని భావించిన రైతాంగానికి తీవ్ర నిరాశే ఎదురైంది. ఎకదాటిగా వర్షాలు కురియడటంతో వేసిన పంటలు ఎదుగుదల లేక రైతన్నలు దిగాలు చెందుతున్నారు. జిల్లాలో కురిసిన భారీ వర్షాలు, వరదలు, మొంథా తుఫాన్ కారణంగా సుమారు పదివేల ఎకరాలలో పత్తి పంటకు నష్టం వాటిల్లింది. వానకాలం సీజన్‌లో సుమారు 4.45 లక్షల ఎకరాల్లో రైతులు జిల్లాలో వివిధ పంటలను సాగు చేస్తున్నారు. ఇందులో పత్తిపంటదే సింహభాగం. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో పత్తి రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పంట చేనులలో వర్షం, వరద నీరు నిల్వ ఉండి పత్తి మొక్కలు పూర్తిగా దెబ్బతిన్నాయి.పంటలు దెబ్బతిన్నాయని దిగుబడి రాదని దిగాలు తో జిల్లాలో వారం రోజుల వ్యవధిలోనే ముగ్గురు రైతులు పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు.

● పదివేల ఎకరాల్లో దెబ్బతిన్న పత్తి..

జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షాలకు పదివేల ఎకరాలలో పత్తి పంటకు నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనాలు వేశారు. కొన్ని మండలాలలో ఎకదాటిగా కురిసిన వర్షాలకు పంటలు నీట మునగగా నది పరివాహక ప్రాంతాలలోని పంట చేలలో ఇసుక మేటలు వేశాయి. వర్షాలతో పంటచేలలో నీరు నిలువ ఉండటంతో పంటలన్ని జవుకుపట్టి పంట ఎదుగుదల నిలిచిపోయింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు కళకళళాడుతాన్నాయని సంతోషంలో ఉన్న రైతులకు భారీ వర్షాలు, వరదలు, మొంథా తుఫాన్ ముంచెత్తడంతో రైతుల ఆశలు ఆవిరయ్యాయి. జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో పాటు ఎగువన మహారాష్ట్రలో కురిసిన వర్షాలకు పెనుగంగా, ప్రాణహిత, పెద్దవాగులు ఉగ్రరూపం దాల్చి అతలాకుతలం చేశాయి. జిల్లా లోని పెనుగంగా, ప్రాణహిత, పెద్దవాగు సరిహద్దు పరివాహక మండలాలైన కౌటాల. చింతల మానేపలి, బెజ్జూర్. పెంచికల్‌పేట్, దహెగాంలలో వేల ఎకారాలలో పంట నష్టం వాటిల్లింది. వరదల కారణంగా పంట పొలాలు వరద నీటిలో మునిగి పోయాయి. కొన్ని చోట్ల ఇసుక మేటలు వేయగా మరికొన్ని చోట్ల పంటలు కొట్టుకుపోయి ఎడారిలా మారాయి. సిర్పూర్ నియోజక వర్గంలో ఏటా వర్షాకాలంలో ప్రాణహిత. పెనుగంగా, పెద్దవాగు పరివాహక ప్రాంతాల్లో వరదలు పంటలను ముంచెత్తుతునే ఉన్నాయి. మహారాష్ట్రలో వర్షాలు కురిసినా, అక్కడి ప్రాజెక్టుల నీటిని వదిలినా ప్రాణహిత పరివాహక మండలాల్లో తీవ్ర పంట నష్టం జరుగుతోంది. దీంతో రైతులు ఏటా నష్టాల పాలవుతున్నారు. నాలుగైదేళ్లుగా పంటలు నష్టపోయిన వారికి పరిహారం రాలేదని రైతులు వాపోతున్నారు.

● జిల్లాలో సాగు ఇలా...

జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 4,45,049 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. ఇందులో పత్తి 3,35,363 ఎకరాలు, వరి పంట 56,861 ఎకరాలు, కంది పంట 30,430 సాగవుతోంది. మొక్కజొన్న, జొన్న,పెసర, మినుములు, సోయబీన్, మిరప, వేరుసెనగ, అముదాలు, నువ్వులు 22,395 ఎకరాలలో పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఈ సీజన్‌లో 3.35లక్షల ఏకరాలలో పత్తి పంట సాగు చేయగా 38 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో అందుకు భిన్నంగా ఉంది. ఏకరానికి 12 క్వింటాళ్ల పత్తి దిగుబడి రావల్సి ఉంది. వర్షాలు, వరదలు, తుఫాన్ ప్రభావంతో పంటలు ధ్వంసమై ఏకరానికి నాలుగు నుంచి ఎనిమిది క్వింటాళ్ల దిగుబడి వచ్చేలా ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఏటేటా పత్తి పంట సాగుకు ఖర్చులు పెరుగుతున్నా రైతన్నలకు మాత్రం గిట్టుబాటు ధర పెరగడం లేదు. దీంతో పత్తి సాగు రైతన్నల పాలిట భారం అవుతున్నది. విత్తనాలు, ఎరువులతో పాటు ఇతరాత్ర వ్యవసాయ పనుల కోసం ఖర్చులు తడిసి మోపడువుతున్నప్పటికీ గిట్టుబాటు ధరలో ఏ మాత్రం తేడా రావడం లేదు. ఏటా అతివృష్టి అనావృష్టితో పత్తి రైతులు కోలోలేక పోతున్నారు.

● మనస్తాపంతో ముగ్గురు..



జాదవ్ బలిరాం (ఫైల్)



పిట్టల కిష్టయ్య (ఫైల్)



బుట్లే సుధాకర్ (ఫైల్)

జిల్లాలో అధిక వర్షాలకు పంట దెబ్బతిన్నదన్న మనస్తాపంతో వారం రోజుల వ్యవధిలో ముగ్గురు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. పంట దిగుబడి రాని పరిస్థితి నెలకొందనే దిగాలుతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. లింగాపూర్ మండలంలోని సీతారాంనాయక్ తండాకు చెందిన జాదవ్ బలిరాం(59), సిర్పూర్-టి మండలం చింతకుంట గ్రామానికి చెందిన పిట్టల కిష్టయ్య (65), వాంకిడి మండల కేంద్రానికి చెందిన బుట్లే సుధాకర్ (34) మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. పంట నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందని ప్రతి పక్షపార్టీల నాయకులు చెబుతున్నారు. నష్టపోయిన పంటలకు ఎకరానికి రూ.10వేలు నష్టపరిహరం చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించినా తగిన కార్యాచరణ లేక రైతులు ఆవేదన చెందుతున్నారు.

రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు కలగకుండా పత్తి కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి జిల్లా వ్యవసాయ, మార్కెటింగ్, రవాణా, అగ్నిమాపక, పోలీసు శాఖల అధికారులు, సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమాన్యలతో పత్తి కొనుగోలు, జిన్నింగ్ మిల్లులలో ఏర్పాట్లు, కపాస్ కిసాన్ మొబైల్ యాప్ నిర్వహణ, రైతులకు అవగాహన, జిన్నింగ్ మిల్లులో రక్షణ చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2025-26 సీజన్ పత్తి కొనుగోలుకు జిన్నింగ్ మిల్లుల యజమానులు, సీసీఐ, మార్కెటింగ్ అధికారులు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో ఈ సీజన్‌లో 3.30 లక్షల ఎకరాల్లో పత్తి సాగయిందని చెప్పారు. 38 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. ఆ దిశగా కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పత్తికి మద్దతు ధర రూ.8,110 నిర్ణయించారని అన్నారు. జిల్లాలో 24 జిన్నింగ్ మిల్లుల ద్వారా సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని సకాలంలో కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చే విధంగా మొబైల్ యాప్ వినియోగంపై వ్యవసాయాధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ప్రతి జిన్నింగ్ మిల్లులో తనిఖీలు నిర్వహించి రక్షణ పరమైన ఏర్పాట్లు పరిశీలించాలని, మిల్లు నిర్వాహకులకు సూచనలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ జాస్తిన్ జోల్, మార్కెటింగ్ అధికారి ఆశ్వక్ అహ్మద్, రవాణా శాఖ అధికారి రాంచందర్, సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామసభలు

వాంకిడి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనర్‌గాం, పాటగూడ, చిచ్చుపల్లి, గోయగాం గ్రామ పంచాయతీల్లో మంగళవారం ఉపాధి హామీ పథకంలో 2026-27 ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న కొత్త పనుల గుర్తింపు కోసం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగ ఏపీవో శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో గత సంవత్సరం జరిగిన పనుల వివరాలు, కూలీలకు చెల్లించిన వేతనాలు వివరించారు. ఈ సందర్భంగా చేపట్టనున్న పనుల జాబితాను గ్రామ సభలో చదివి వినిపించారు. కార్యక్రమంలో టీఏ వెంకటేష్, కార్యదర్శి సౌమ్య, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు జొన్న విత్తనాలు పంపిణీ

జైనూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని డీఏవో కార్యాలయంలో మంగళవారం రైతులకు వంద శాతం రాయితీపై జొన్న విత్తనాలను మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్ , పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ మకీద్, ఉపాధ్యక్షులు పెందుర్ ప్రకాష్, పీఏసీఎస్ సిర్పూర్(యు) చైర్మన్ కెంద్రే శివాజీ, మాజీ సర్పంచ్ కినక రాంషావ్, ఏవో ఆనంద్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకా

జైనూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) మండలంలోని జంగాంలో మంగళవారం పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలు వేశారు. ఈ సందర్భంగా వెటర్నరీ అసిస్టెంట్ సికిందర్, సిబ్బందితో కలిసి గాలి కుంటు వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి మురళి కృష్ణ, వెటర్నరీ అసిస్టెంట్ సికిందర్, సిబ్బంది మంగిలాల్, ప్రకాష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

రెబ్బెన, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రెండో ఏఎన్ఎంలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని మండల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రిషికకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపేందర్, ప్రమీల, సునీత, వనిత, పద్మ, తులసీరాం, విజయలక్ష్మి, మండల్, రేణుక పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ నియోజక వర్గంలోని పలు మండలాలకు చెందిన 26 మందికి మంగళవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కోవ లక్ష్మి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్ నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం న్యాయవాదులు ప్రత్యూష, అనిత, నిఖిల్‌లు ఎమ్మెల్యే కోవ లక్ష్మి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరడంతో వారికి కండువాలు వేసి ఆహ్వానించారు.. కార్యక్రమంలో నాయవాదులు శ్రీనివాసరావు, సుధాకర్, మహేష్‌గౌడ్, శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పండ్లు పంపిణీ

కెరమెరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలం సాకడ టీడబ్ల్యూపీఎస్ పాఠశాల, కెరమెరి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులుకు పెందూర్ శాయంరావు పటేల్ వర్ధంతి సందర్భంగా సేవా సమితి ఆధ్వర్యంలో పండ్లు, పండ్ల రసం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సై మధుకర్, మాజీ ఎంపీపీ మోతిరాం, నాయకులు ఇష్తేకార్, ఆనందరావు, తుకారాం, ఆనంద్‌రావు, వెంకటేష్, దేవేందర్, దిందర్, రాంచందర్, ప్రకాష్, రాందాస్, రాజేష్, ప్రకాష్, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందన

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలుర విభాగంలో ప్రతిభ చాటిన విద్యార్థులను మంగళవారం పలువురు అభినందించారు. మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి వచ్చిన నాలుగు జట్ల నుంచి కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు.. వీరు రాష్ట్ర స్థాయిలో పాల్గొనున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ వెంకటేశం తెలిపారు.

మౌన పోరాట దీక్షను విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధించేందుకు ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని మహాత్మజ్యోతిభాపూలే విగ్రహం ఎదుట నిర్వహించే మౌన పోరాట దీక్షను విజయవంతం చేయాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం చైర్మన్ రూప్‌నార్ రమేశ్ అన్నారు. స్థానికంగా మంగళవారం సంఘం నాయకులతో ఏర్పా టు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. . కార్యక్రమంలో నాయకులు ప్రణయ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మహా పాదయాత్రకు పోటెత్తిన భక్తులు

- ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు
- ఏటా కార్తీక మాసంలో నిర్వహణ

సిర్పూర్(టి), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని హనుమాన్ ఆలయం నుంచి సిర్పూర్(టి) మండలం టోంకిని సిద్ధి హనుమాన్ ఆలయం వరకు మంగళవారం నిర్వహించిన 24వ మహాపాద యాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్తీక మాసంలో కాగజ్‌నగర్ పట్టణంలోని హనుమాన్ ఆలయం నుంచి 27 కిలో మీటర్ల దూరంలో ఉన్న టోంకిని హనుమాన్ ఆలయానికి పాదయాత్ర నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. పాదయాత్రలో వయో బేధం లేకుండా చిన్న పిల్లల నుంచి మొదలుకుని వృద్ధుల వరకు పాదయాత్ర నిర్వహించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పాదయాత్రలో సుమారు 40 నుంచి 50 వేల మంది వరకు భక్తులు పాల్గొని ఉంటారని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొంటున్నారు. ఉదయం 4 గంటల నుంచే భక్తులు పాదయాత్రను ప్రారంభించి 9.30 నుంచి 11 గంటల వరకు ఆలయానికి చేరుకున్నారు. టోంకిని మహాపాదయా త్రకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఆలయం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీతో పాటు పోలీసు శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. అలాగే ఆలయ కమిటీ, యువతేజ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.



క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

పండ్లు పంపిణీ..

కాగజ్‌నగర్ పట్టణం నుంచి 27 కిలో మీటర్ల దూరంలో ఉన్న టోంకిని హనుమాన్ ఆలయానికి పాదయాత్ర చేపట్టిన భక్తులకు సిర్పూర్(టి) మండలం వెంపల్లి నుంచి మొదలుకుని వెంకట్రావుపేట క్రాస్ రోడ్డు వరకు రాజకీయ పార్టీల నాయకు లతో పాటు పలువురు వ్యాపారులు, స్వచ్ఛంద సేవా సంస్థల వారు, రాజకీయ పార్టీల నాయకులు తేనీరు, మంచినీరు, పండ్లు, అల్పాహారం పంపిణీ చేశారు. కాగా సిర్పూర్(టి) మండలానికి చెందిన సిర్పూర్(టి) ఫిల్లింగ్ ఎంఎ ముక్తదీం, హెచ్‌పీ గ్యాస్ డీలర్ మహ్మద్ ఖుర్షీద్ హుస్సేన్, నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాయ కులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, వ్యాపారులు తదితరులు అడుగడుగున భక్తులకు పండ్లు, తేనీరు, పాలు, పంపిణీ చేశారు. కాగా మహాపాదయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ డీఎస్పీ వహిదుద్దీన్, కౌటాల సీఐ సంతోష్‌కుమార్. సిర్పూర్(టి), కౌటాల, కాగజ్‌నగర్, బెజ్జూరు, చింతలమానేపల్లి తదితర మండలాలకు చెందిన ఎస్సైల ఆధ్వర్యంలో భారీ బందో బస్తు ఏర్పాటు చేశారు. అలాగే జిల్లా అటవీ రేంజ్ అధికారి ప్రవీణ్‌కుమార్ ఆలయ సమీపంలో పెన్‌గంగా నది స్నానాల ఘాట్ వద్ద అటవీ శాఖ సిబ్బందితో అటు వైపు భక్తులు వెళ్లకుండా సిబ్బందిని కేటాయించి అప్రమత్తం చేశారు.



టోంకిని ఆలయానికి పాదయాత్ర చేపడుతున్న భక్తులు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కాగజ్‌నగర్ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ పెట్రోల్ పంపు పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలైన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వ్యాస రచన పోటీల్లో ఇక్రా ఫాతిమా, ఉపన్యాస పోటీల్లో చింతగూడ జడ్పీహెచ్ఎస్ విద్యార్థి అక్షర ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే ఉపన్యాస పోటీల్లో పెట్రోల్ పంపు జడ్పీహెచ్ఎస్ విద్యార్థి గుగులావత్ అర్జున్ ప్రథమ స్థానంలో గెలుపొందారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. విజేతలకు ప్రశంసాప్రతాలు అందజేశారు. కార్యక్రమంలో పరశ చంద్రశేఖర్, తాటి రవీందర్, రోజా రమణి, తిరుపతయ్య, రాజేశం, అనీస్ అహ్మద్, సుదారాణి, షహనా సుల్తానా, కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

ప్రైవేటు కళాశాలల బంద్‌కు మద్దతు

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా స్కాలర్ షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయక పోవడంతో ప్రైవేటు కళాశాలల యజమాన్యాలు తలపెట్టిన నిరవధిక బంద్‌కు పీడీఎస్‌యూ పూర్తి మద్దతు ఇస్తుందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి అన్నారు. స్థానికంగా మంగళవారం పలువురు విలేకరులతో మాట్లాడుతూ సాకలర్ షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక చదువు పూర్తయిన విద్యార్థులు సర్టిఫికెట్ల విషయంలో చాలా ఇబ్బంది పడాల్సి వస్తుందని చెప్పారు. ప్రభుత్వ చర్చల పేరుతో కాలయాపన చేయడం తప్ప ఏం చేయడం లేదని అన్నారు. ఇప్పటికైనా విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నితీన్, వంశీ, సమీర్, లక్ష్మణ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగాహారతి



పెద్దవాగులో దీపాలు వదులుతున్న మహిళలు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పెద్దవాగులో కార్తీక మాసం సందర్భంగా మంగళవారం సాయంత్రం మహిళలు గంగాహారతిని ఇచ్చిన దీపాలను వెలిగించారు. ఆలయాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. పంచపర్వాల సందర్భంగా ఉదయం నాలుగు గంటల నుంచి స్థానిక పెద్దవాగులో భక్తులు స్నానాలు ఆచరించారు. ఉపవాస దీక్షలు, దీపదానాలు, తులసీ వివాహాలతో పట్టణంలో పం డుగవాతావరణం నెలకొంది.పెద్దవాగులో సాయంత్రం గంగాహారతి ఇచ్చి దీపాలను వదిలారు. ఆలయాలను దీపాలతో అలంకరించారు.

సిర్పూర్(యు), ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తులసీ వివాహం ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే మహిళలు మంగహారతులు పట్టి పసుపు కుంకుమలతో తులసి మంటపాన్ని సుందరంగా అలంకరించారు. సాయంత్రం పుణ్యకాలంలో పూజారుల మంత్రోచ్చారణల మధ్య తులసి అమ్మవారికి శాలిగ్రామ స్వామివారిని కలిపి వివాహ మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివాలయంలో మహిళలు బిల్వ అర్చన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివుడికి బిల్వ పత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వైకుంఠ దీపాలను వెలిగించారు.

పత్తి కొనుగోళ్లలో నిబంధనలు సరికాదు

ఆసిఫాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీసీఐ ద్వారా ఎకరానికి ఏడు క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేసే నిబంధన సరికాదని, యథావిధిగా 12 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయాలని బీసీ యువజన సంగం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ ఆధ్వర్యంలో కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఒక వైపు ప్రకృతి, మరో వైపు సీసీఐ కొనుగోలు నిబందనలతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎకరానికి 12 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేయాలని కోరారు. రైతులు ఇబ్బందులు పడకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆకాష్, అరుణ్, సమ్మన్న, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు విద్యార్థి ఎంపిక

చింతలమానేపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కర్జవెల్లి గ్రామానికి చెందిన పదో తరగతి చదువుతున్న రౌతు విష్ణువర్ధన్ అనే విద్యార్థి రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జోనల్ స్థాయిలో ప్రతిభ కనబర్చి మహబూబాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపికయ్యాడని చెప్పారు. ఎంపికైన విద్యార్థిని ఎంఈవో జయరాజు, ఇన్‌చార్జి హెచ్‌ఎం దానయ్య, పీడీ హరీష్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

ఆపద్బాంధవులు



- ప్రాణరక్షణలో బాధితులకు 108 సిబ్బంది ఆపన్నహస్తం
- 24 గంటలు..365 రోజులు సేవలు

వాంకిడి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాత్రి, పగలు తేడా లేకుండా ఎక్కడైనా ప్రమాదం జరిగినా.. గర్భిణులకు పురిటినొప్పులు వచ్చినా.. నేనున్నానని మీకేంకాదని మనోధైర్యాన్ని కలిగించేది 108 అంబులెన్స్. 24 గంటలూ ప్రజల ప్రాణాలు కపా డేందుకు సిద్ధంగా ఉంటుంది. రోడ్డు ప్రమాదాల బారిన పడిన క్షతగాత్రులకు, గుండెపోటు బారిన పడినవారికి అపార సంజీవనిగా మారింది. ఎంతటి విపత్కర పరిస్థితుల్లోనైనా సమాచారం రాగానే సిబ్బంది స్పందించి సకాలంలో ఘటనా స్థలానికి చేరుకుంటారు. ఓ వైపు ప్రథమ చికిత్స అందిస్తూనే మరోవైపు ఆసుపత్రులకు తరలిస్తారు. సిబ్బందితో డ్పాటుతో ఎంతో మంది ప్రాణాలతో బయటపడ్డారు.

జిల్లాలో 60 మంది సిబ్బంది

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 108 అంబులెన్స్ వాహనాలు 15 ఉండగా 30 మంది ఈఎంటీలు, 30 మంది పైలేట్‌లు పనిచేస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు వరకు 25,415 మంది బాదితులకు ఆసుపత్రికి తరలించారు. అనేక మంది గర్భిణులను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు ఎక్కువైతే కాన్పులు చేశారు. సమయం అంటూ లేకుండా నిరంతరం సేవలందిస్తూ ప్రాణదాతలుగా నిలుస్తున్నారు. ఉపాధి పొందడానికి ఈ వృత్తిలోకి వచ్చినా విధి నిర్వహణలో ఆపద్బాంవుల పాత్ర పోషిస్తున్నారు. వారే 108 వాహనంపై విధులు నిర్వర్తించే ఈఎంటీ(ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్), పైలెట్లు, రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారిని, అత్యవసర వైద్యసేవలు అవసరం ఉన్న వారికి, ప్రసవవేదన పడుతున్న గర్భిణులకు, అస్వస్థతకు గురైన వారిని వైద్య చికిత్స అందించి సకాలంలో ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడుతున్నారు. 2025 జనవరి నుంచి 2025 సెప్టెంబరు వరకు మెడికల్ 18,631, గర్భిణులు 2,646, రోడ్డుప్ర మాదాలు 1,708, గుండే సమస్యలు 1,203, శ్వాసకోశ సమస్యలు 1,235 మందిని ఆసుపత్రికి తరలించారు.

సిబ్బందిని అప్రమత్తం చేస్తాం..

మెరుగు నరేష్ యాదవ్, 108 ప్రోగాం మేనేజర్



ఎలాంటి సమస్యలతోనేనా 108కు సమాచారం వచ్చిన వెంటనే అత్యవసర వైద్యం అందించడానికి కృషి చేస్తాం. ఘటనాస్థలానికి వెంటనే చేరుకునేలా సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం. 108 సిబ్బంది అనేక మంది ప్రాణాలు కాపాడారు. అనుకోని ఘట నలు జరిగినప్పుడు వెంటనే 108 వాహనాలకు సమాచారం అందించి అంబులెన్స్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

ఏడాది కాలంగా.. : ప్రవీణ్ యాదవ్, ఈఎంటీ



గత ఏడాది నుంచి ఈఎంటీగా 108లో పనిచేస్తున్నాను. అత్యవస సమయాల్లో ఫోన్ రాగానే ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించి చికిత్సలు చేయిస్తున్నాం గర్భిణులను ఆసుపత్రికి తరలించే క్రమంలో కొంతమందికి పురి టినొప్పులు రావడంతో మార్గమధ్యలోనే ప్రసవాలు చేశాం. తల్లీబిడ్డలను సురక్షితంగా ఆసుపత్రిలో చేర్పినప్పుడు కలిగే ఆనందం మాటల్లో చెప్పలేను.

సకాలంలో ఆసుపత్రులకు చేర్చుతున్నాం..

జంబుల సంతోష్, పైలట్



బాధితులను సకాలంలో ఆసుపత్రులకు చేర్చుతున్నాం. 16 ఏళ్లుగా 108లో పైలెట్‌గా పనిచేస్తున్నాను. అత్యవసర సమయంలో వచ్చే ఫోన్ కాల్స్‌కు వెంటనే స్పందించి సకాలంలో ఘటన స్థలానికి చేరుకుంటాం. ఆపత్కాలంలో ఎంతో మందిని ఆసుపత్రులకు సకాలంలో చేర్పి వైద్యం అందించడంతో ప్రాణాలతో బయట పడ్డారు. ఇందులో పని చేయడం ఎంతో సంతోషంగా ఉంటుంది.

అనారోగ్యంతో సీపీఐ జిల్లా సమితి సభ్యుడి మృతి



కల్వల లక్ష్మణ్(ఫైల్)

కాసిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా సమితి సభ్యుడు కల్వల లక్ష్మణ్(78) మంగళవారం ఉదయం సోమగూడెంలో తన స్వగృహంలో తుదిశ్వాస విడిచాడు. సీపీఐ కాసిపేట మండల కార్యదర్శిగా పనిచేసి ప్రజా సమస్యలపై అనేక ఉద్యమాలను చేశారు. లక్ష్మణ్ కొంత కాలంగా మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. వయోభారంతో పాటు ఆరోగ్యం క్షీణించడంతో ఇంట్లోనే మృతి చెందాడు. లక్ష్మణ్ మృతిపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మండల కార్యదర్శి దాగం మల్లేష్ సంతాపం తెలిపారు. ఆయన ప్రజా సమస్యల పరిష్కారానికి చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. ఆయన మృతదేహంపై సీపీఐ పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. సీపీఐ నాయ కులు చిప్ప నర్సయ్య, జాడి పోశం, పులి శంకర్, కాంగ్రెస్ మం డల అధ్యక్షుడు వేముల కృష్ణ, బీఆర్ఎస్ నాయకుడు రాంచందర్, సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి నివాళులర్పించారు.

లారీ, బైక్ ఢీకొని యువకుడి మృతి



మారుతి(ఫైల్)

జన్నారం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో లారీ, బైక్ ఢీకొన్న ప్రమాదంలో మంగళవారం ఒకరు మృతి చెందారు. ఎస్ఐ గొల్లపెల్లి అనూష తెలిపిన వివరాల ప్రకారం సింగ రాయపేట గ్రామానికి చెందిన అడాయి మారుతి(25) కూలి పని చేస్తూ జీవిస్తున్నాడు. మంగళవారం ఉదయం జన్నారం మండల కేంద్రానికి మేస్త్రీ పనికి వెళ్లాడు. ఉదయం సమయంలో మేస్త్రీ చుక్క గంగాధర్‌ను తన ద్విచక్రవాహనంపై ఎక్కించుకొని తాళ్లపేట వైపు వెళ్తుండగా లక్షెట్టిపేట నుంచి జన్నారం వస్తున్న ఏపీ39 యుక్యు 6579 నెంబర్ గల లారీ డ్రైవర్ అతివేగంతో నడుపుతూ చింతగూడ గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న మారుతి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో మారుతి రోడ్డుప క్కన ఎగిరిపడడంతో తలకు గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న గంగాధర్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం లక్షెట్టిపేట ఆసుపత్రికి తరలించారు. తన కొడుకు మృతికి కారణమైన ఏపీకి చెందిన లారీ డ్రైవర్ కెలారి బల రామకృష్ణపై మారుతి తండ్రి అడాయి భీము ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గొల్ల అనూష తెలిపారు.

డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు



తనిఖీలు చేపడుతున్న అటవీశాఖ అధికారులు

సిర్పూర్(టి), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నవేగూడ, దుబ్బగూడ అటవీ ప్రాంతంలో కంచెకు ఏర్పాటు చేసిన సోలార్ బ్యాటరీలను గత కొన్ని రోజుల క్రితం చోరీకి గురవడంతో మంగళవారం అటవీశాఖ డాగ్ స్క్వాడ్ బృందం సభ్యులు తనిఖీలు చేపట్టారు. అధికారులు మాట్లాడుతూ చోరీకి పాల్పడిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో మోహన్‌రావు, తదతరులు పాల్గొన్నారు.

నేడు గూడెంగుట్టలో మహా జాతర

ముస్తాబైన సత్యదేవుడి ఆలయం



సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

దండేపల్లి నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గూడెంగుట్ట కొండపై సత్యనారాయణ దేవాలయంలో బుధవారం జరిగే కార్తీక పౌర్ణమి మహాజాతరకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయానికి రాష్ట్రంలోని పలు జిల్లాల లక్షలాది మంది భక్తులు రానున్న నేపథ్యంలో దేవాలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయంలోని కింద, పైన వ్రత మండపాలతో పాటు అదనంగా వ్రత మండపాలను ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా క్యూలైన్ల కోసం బారికేడ్లు ఏర్పాటు చేశారరు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా కలెక్టర్, రామగుండం సీపీ, ఆదేశాల మేరకు లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి దండేపల్లి ఎస్సై ఎండి తహసీనోద్దీన్ ఆధ్వర్యంలో దేవాలయం, పోలీసు సిబ్బందితో బారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. మంగళవారం కార్తీక ఉత్సవాల్లో భాగంగా దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను వేద పండితులు అభిరామచార్యుల మంతోచ్చరణల మధ్య వైభవంగా నిర్వహించారు. పలువురు భక్తులు సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు.

ఉద్యోగుల హక్కుల కోసం పోరాటం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

మందమర్రిటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో ఎమర్జెన్సీ కాలంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారంతో పాటు హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసి అమరుడైన నేత కామ్రేడ్ వీటీ అబ్రహం అని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఏరియా కార్యదర్శి బీమనాథుని సుదర్శన్ అన్నారు. ఏఐటీయూసీ నేత వీటి ఆబ్రహం వర్ధంతిని స్థానిక ఏఐటీయూసీ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించారు. ముందుగా అబ్రహం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో పుట్టి సింగరేణికి వలస వచ్చి ఇక్కడి ఉద్యోగుల కష్టాలు, కన్నీళ్లను చూసి చలించిన నాయకుడు అబ్రహం అన్నారు. యాజమాన్యం నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేశారని కొనియాడారు. అనంతరం పార్టీ కార్యాలయం నుంచి అబ్రహం స్తూపం వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు దాగాం మల్లేష్, కంది శ్రీనివాస్, సోమిశెట్టి రాజేశం, రాజేశ్వర్‌రావు, ఇప్పకాయల లింగయ్య, ముల్కలపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శ్రావణి కుటుంబానికి న్యాయం చేయాలి



ఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఆసిఫాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం గెర్రె గ్రామంలో కుల దురహంకార హత్యకు గురైన శ్రావణి కుటుంబానికి న్యాయం చేయాలని మంగళవారం కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ కాంతిలాల్ పాటిల్‌కు ప్రజా సంఘాల నాయకులు వినతి పత్రం అందజేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో దినకర్, కార్తీక్, దినకర్, రాజేందర్, టీకానంద్, తిరుపతి, మాల శ్రీ, పద్మ, శ్రీనివాస్, కోటేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు సంపూర్ణ అక్షరాస్యత సాధించాలి

సిర్పూర్(యు), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామ మహిళా సంఘం సంపూర్ణ అక్షరాస్యత సాధించాలని ఓరుగల్లు మహాసమాఖ్య సీఆర్పీలు కవిత, భారతి అన్నారు. మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య భవనంలో ఉల్లాస్ అక్షర వికాసం వయోజన విద్య అవగాహన ఓరుగల్లు మహాసమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉల్లాస్ అక్షర వికాసం వయోజన కరపత్రాలు విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో మహిళా సంఘల సభ్యులను సంపూర్ణ అక్షరాసులుగా తీర్చిదిద్దాలన్నారు. చదువుకుంటే కలిగే లాభాలను వివరించాలన్నారు. కార్యక్రమాన్ని మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో రాధబాయి, రేణుక పాల్గొన్నారు.

శత జయంతి వేడుకలకు ఏర్పాట్లు



కరపత్రాలు అవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

రెబ్బెన, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కలవేన శంకర్ అన్నారు. గోలేటి పట్టణంలోని కామ్రెడ్ మహేంద్ర భవన్‌లో మంగళవారం జిల్లా సమితి సమావేశాన్ని గోలేటి టౌన్ అధ్యక్షుడు ఎస్‌తిరుపతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ పార్టీ ఆవిర్భవించి డిసెంబరు 26 నాటికి వంద సంవత్సరాలు పూర్తవుతుందన్నారు. శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నామని తెలిపారు. ఈ సందర్భంగా శత జయంతి ఉత్సవాల కరపత్రాలను నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు సత్యనారాయణ, లక్ష్మణ్, సాయికుమార్ నాయకులు చిరంజీవి, ఉపేందర్, నర్సయ్య, సీతారాం, మల్లికార్జున్, అంబారావు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేయాలి



వాంకిడిలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

వాంకిడి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పనులను లబ్ధిదారులు వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. వాంకిడి మండలం జైత్‌పూర్ గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామం మొదటి విడత ఇందిరమ్మ మోడల్ గ్రామంగా ఎంపికైందని చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో నిర్మాణాలు చివరి దశలో ఉండడం సంతృప్తికరంగా ఉందని అభినందించారు. త్వరలో ప్రారంభానికి సిద్ధం చేసేలా పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట పీడీ వేణుగోపాల్, ఇంజనీరింగ్ అదికారులు, కమిటీ సభ్యులు ఉన్నారు.

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని ఈ నేపథ్యంలో విద్యార్థుల సంఖ్యను పెంపొందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లాలోని 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో విద్యార్థులు, అధ్యాపకుల హాజరు, ముఖ గుర్తింపు యాప్, విద్యాబోధన, మౌలిక వసతుల కల్పన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ ప్రభుత్వ విద్యా వ్యవస్థలు బలోపేతం చేస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతుందని ఈ నేపథ్యంలో జూనియర్ కళాశాలలో పూర్తి సదుపాయాలు కల్పించడం జరిగిందని, విద్యార్థుల సంఖ్య పెంపొందించే విధంగా కృషి చేయాలని తెలిపారు. విద్యార్థుల గైర్హాజరు పై వారి తల్లితండురలతో మాట్లాడి క్రమం తప్పకుండా హాజరయ్యేలా కృషి చేయాలని తెలిపారు. వార్షిక పరీక్ష ఫలితాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపే విధంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కార్యక్ర మంలో మాధ్యమిక విద్యాశాఖాధికారి రాందాస్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బ్యాంకు లింకేజీ ప్రక్రియ వంద శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టర్ భవనం సమావేశం మందిరంలో సెర్ప్ పీఎం సుధాకర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాంలతో కలిసి సెర్ప్ డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలతో బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి రుణలు, యూడీఐడీ పెన్షన్, నూతన గ్రూపుల ఏర్పాటు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాయంకు లింకేజీ లక్ష్యాన్ని వంద శాతం పూర్తి చేయాలని, స్త్రీ నిధి రుణ లక్ష్యాన్ని వంద శాతం పూర్తి చేయాలని తెలిపారు. ప్రభుత్వం సహాయం సహాయక సంఘాల మహిళలకు ఇందిరా మహిళా శక్తి పథకం కింద కోళ్ల పెంపకం, డైరీ ఫారం ఏర్పాటు, చేపల పెంపకం, సోలార్ విద్యుత్ యూనిట్ ఏర్పాటు, క్యాంటీన్ నిర్వహణలతో వ్యాపార అభివృదిధకి ప్రోత్సహిస్తుందని స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అనేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. నూతన స్వయం సహాయక సంఘాల ఏరాపటు చేసి వారికి రుణ సదుపాయాన్ని కల్పించి అభివృద్ధి చెందేందుకు అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు ఆర్థికంగా వెనకబడిన సంఘ సభ్యులకు రూ.50 వేల వరకు మండల సమాఖ్య నుంచి రుణాలు అందంచాలన్నారు. స్వయం సహాయక సంఘాల బలోపేతానికి డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు సమ్వయంతో కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్లు, సహా య ప్రాజెక్టు మేనేజర్లు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

కోల్ ఇండియా పోటీల్లో సత్తా చాటాలి



మాట్లాడుతున్న జీఎం రాధాకిష్ణ

మందమర్రిటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోల్ ఇండియా సంస్కృతిక పోటీల్లో సింగరేణి సత్తా చాటి ప్రథమ బహుమతి సాధించాలని మందమర్రి జీఎం రాధాక్రిష్ణ తెలిపారు. స్థానిక సీఈఆర్ క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన కంపెనీ లేవల్ కల్చరల్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు జెండాను ఆవిష్కరించారు. అనంతరం నటరాజ చిత్రం వద్ద జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కళాకారులను ఉద్దేశించి మాట్లాడారు. సింగరేణిలో కళాకారులకు కొదవలేదన్నారు. గత మూడు నుంచి నాలుగు దశాబ్దాలుగా వారు ఎంచుకున్నటువంటి కళలో రాణిస్తున్నారన్నారు. గత సంవత్సరం కోల్ ఇండియా పోటీల్లో ప్రథమ బహుమతి సాధించడం ప్రతిభకు నిదర్శనమన్నారు. ఈ సంవత్సరం కూడా బహుమతి సాధించాలన్నారు. గతంలో కళాకారులు సింగరేణిలో జరుగుతున్న అనేక సంఘటనలో ఉద్యోగులను చైతన్యపరిచేందుకు ప్రదర్శనలు చేస్తూనే ఉన్నారన్నారు. ఉద్యోగుల క్రీడలకు యాజమాన్యం ఎప్పుడు పెద్దపీట వేస్తుందన్నారు. పోటీల్లో పాల్గొంటున్న ఆ ఏరియా సంస్కృతిక విభాగం ఉద్యోగుల క్రీడా స్పూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బ్రాంచి సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, అధికారుల సంఘం అధ్యక్షుడు రమేష్, పర్సనల్ మేనేజర్ పి. శ్యాంసుందర్, క్రీడల ప్రదాన కార్యదర్శి మాస్కుల కార్తీక్, ఏరియా స్పోర్ట్స్ సూపర్ వైజర్లు అశోక్, నరేందర్ రెడ్డి, శ్రీనివాస్, హెచ్.రమేశ్‌పాల్గొన్నారు.

మందమర్రిటౌన్, (ఆంధ్రజ్యోతి): మొకలే మాన వాళి మనుగడకు జీవనాధారమని జీఎం రాధాకృష్ణ అన్నారు. స్థానిక వెంకటేశ్వర ఆలయం ఆవరణలో మంగళవారం మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ఆలయ పరిసరాల్లో భక్తుల ఆహ్లాదం కోసం మొక్కలను పెంచి పెద్ద చేయాలన్నారు. మొక్కల సంరక్షణను అందరు బాధ్యతగా తీసుకోవాలన్నారు. సింగరేణి యాజమాన్యం మొక్కల పెంపకానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఇందులో భాగంగా నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతున్నామన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి 150కి పైగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్‌సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఇంజనీర్ బాలాజీ భగవత్, డీజీఎం ఈఅండ్ఎం దూప్‌సింగ్, ఎఫ్అండ్ఏ ప్రసాద్, సివిల్ ఎస్ఐ రాము, ఫారెస్టు అధికారి నవీన్ కుమార్, పర్యావరణ అధికారి వెంకట్‌రెడ్డి, సీనియర్ పర్సన్ ఆఫీసర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

108లో ప్రసవం

చింతలమానేపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కార్‌రెబ్బెన గ్రామానికి చెందిన పి. శంకరమ్మ అనే గర్భిణి 108లో ఆసుపత్రికి తరలిస్తుండగా ప్రసవించింది. శంకరమ్మకు సోమవారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. శంకరమ్మను 108 సిబ్బంది సిర్పూర్(టి) సామాజిక ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో పురిటి నొప్పులు ఎక్కువై 108లోనే ప్రసవించి మగ శిశువుకు జన్మనిచ్చింది. తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నట్లు ఈఎంటీ సాగర్, పైలట్ నరేష్ తెలిపారు.

ఓటరు నమోదుపై విద్యార్థులకు అవగాహన

బెజ్జూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండల కేంద్రంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలలో మంగళవారం ఓటరు నమోదు ప్రక్రియపై విద్యార్థులకు తహసీల్దార రామ్మోహన్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా నగర సంకీర్తన

కన్నెపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ అభయాంజ నేయ స్వామి ఆలయంలో నగర సంకీర్తన ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయం నుంచి వీధుల గుండా మహిళ లు మంగళహారతులతో భజన కార్యక్ర మాలను నిర్వహిస్తూ నగర సంకీర్తన చేప ట్టారు. అనంతరం మహిళలు ఆలయం లోని ఉసిరిక చెట్టుకు పూజలు చేసి కార్తీక దీపాలను వెలిగించారు.

మండల స్థాయి పోటీలు

కాసిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) :మండల కేంద్రంలోని కాసిపేట జిల్లా ప రిషత్ పాఠశాలలో టీశాట్ గెజిటెడ్ హె డ్మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మం గళవారం విద్యార్థులకు వివిధ విభాగాల్లో ప్రతిభ పోటీలు నిర్వహించారు. విజేతల కు ఎంఈవో వెంకటేశ్వరస్వామి బహుమ తులు, ప్రశంసాపత్రాలు అందించారు. వి జేతలైన విద్యార్థులు ఈ నెల 7న జిల్లా కేంద్రంలో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పా ల్గొంటారని తెలిపారు. మండల నోడల్ ఆ ఫీసర్ రాథోడ్ రమేష్, ప్రధానోపాధ్యాయు డు రమణా రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

బెల్లంపల్లి,నవంబరు4(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్క రు కృషి చేయాలని ఏసీపీ రవి కుమార్ అన్నారు. మంగళవారం వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగాహా జరై మాట్లాడారు. వాహనదారులు ప్రయా ణం చేసేటప్పుడు నిబంధనలు పాటించా లన్నారు. అనంతరం వాహనదారులతో రోడ్డు భద్రత అందరి బాధ్యత అని ప్రతిజ్ఞ చేయించారు.

పరిమితికి మించి ప్రయాణం



'మహాలక్ష్మి'తో ఆర్టీసీలో పెరిగిన రద్దీ

ప్రయాణికులకు అనుగుణంగా పెరగని బస్సులు

ఇబ్బందులు పడుతున్న డ్రైవర్లు, ప్రజలు

బెల్లంపల్లి, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీలో మహిళలకు ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం కల్పించింది. దీంతో పల్లెవెలుగులు, ఎక్స్‌ప్రెస్‌లలో ప్రయాణికుల రద్దీ తీవ్రంగా పెరిగింది. కానీ ఇందుకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెం చకపోవడంతో అటు ప్రయాణికులకు, ఇటు బస్సు నడిపే డ్రైవర్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒక్కో బస్సులో పరిమితికి మించి ప్రయాణం చేస్తు న్నారు. దీంతో డ్రైవర్లు గమ్యస్థానాలకు తీసుకెళ్లే సమ యంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఏదైనా అనుకోని ప్రమాదం సంభవించే సమయంలో బస్సును అదుపు చేయడం కష్టతరంగా మారు తుందని వాపోతున్నారు.

పెరుగని బస్సుల సంఖ్య..

మంచిర్యాల ఆర్టీసీ డిపో పరిధిలో మొత్తం 147 బ స్సులు ఉన్నాయి. ఈ బస్సులు జిల్లాలోని చెన్నూర్, బె ల్లంపల్లి, కాగజ్‌నగర్, కరీంనగర్, హైదరాబాద్, ఆదిలా బాద్ పట్టణాలకు వెళ్తుంటాయి. ప్రతీ రోజు ఈ బస్సు లు 63,200కిలోమీటర్లు ప్రయాణిస్తూ 61వేల మందిని గమ్య స్థానాలకు చేరవేస్తాయి. ముఖ్యంగా మంచిర్యా ల నుంచి చెన్నూర్, మంచిర్యాల నుంచి బెల్లంపల్లి మీదుగా కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ పట్టణాలకు ఎక్కువ శాతం బస్సులు ప్రయాణికులను చేరవేస్తుం టాయి. ఈ పట్టణాలకు వెళ్లే బస్సులు సరిపడా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నిబంధనలు గాలికి..

జిల్లాలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఒక్కో బస్సులో పరిమితికి మించి ప్రయాణం చేస్తు న్నారు. ఎక్స్‌ప్రెస్ బస్సులో 50 మంది, పల్లెవెలుగు బస్సులో 60 మందికి మించి ప్రయాణించరాదని నిబంధనలు ఉన్నా ఎవరు పట్టించుకోవడం లేదు. మహాలక్ష్మీ పథకంలో ఆర్టీసీలో మహిళలకు ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో బస్సులో మహిళా ప్రయాణికుల రద్దీ తీవ్రంగా పెరిగింది. రద్దీకి అనుకూలంగాడి పోలో బస్సులు లేకపోవడం సమస్యగా మారుతుంది. మరో 20 బస్సులో అవసర మని ఆర్టీసీ అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక లు పంపించినా స్పందన లేదు. దీంతో చేసేది లేక ప్రయాణికులు ఉన్న బస్సుల్లోనే కిక్కిరిసి ప్రయాణం చేస్తున్నారు.

ఉదయం సాయంత్రం ఎక్కువగా..

ప్రతీ రోజు జిల్లాలోని ఆయా మండలాలతో పాటు వివిధ పట్టణాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ఆర్టీసీ బస్సులో పరిమితికి మించి ప్రయాణం చేస్తున్నారు. మంచిర్యాల డిపో నుంచి ఏ ప్రాంతానికి వెళ్లే బస్సులు చూసినా కిక్కిరిసి ఉంటున్నాయి. ఉదయం వేళల్లో పాఠ శాలలు కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు ఉద్యోగులు, రోజువారి కూలీలు ఆర్టీసీ బస్సు ల్లోనే ప్రయాణిస్తుంటారు. బస్సులో స్థలం లేక ఫుట్‌బోర్డుపై నిల్చుని ప్రయాణం చేస్తున్నారు. ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లు వద్దని వారిస్తున్నా కొందరు వాగ్వివాదానికి దిగుతున్నారు. ఇలాంటి సమయంలో ఏదైనా అనుకోని ప్రమాదం సంభ విస్తే బస్సును అదుపు చేయడం కష్టంగా ఉం టుందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి రోజు నిల్చొనే వెళ్తాం..

రాజేశ్, బెల్లంపల్లి ప్రయాణికుడు



ప్రతీ రోజు ఉద్యోగ రీత్యా నేను బెల్లంపల్లి నుంచి మంచిర్యాలకు ఆర్టీసీ బస్సులో వెళ్తుంటాను. ఒక్క రోజు కూడ బస్సుల్లో సీటు దొరకదు. నిల్చోని ప్రయాణం చేస్తుంటాను. సరిపడా బస్సులు లేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

బస్సుల్లో కిక్కిరిసిపోతున్నారు...

సురేశ్, ప్రయాణికుడు బెల్లంపల్లి



ఆర్టీసీ బస్సుల్లో కిక్కిరిసిన ప్రయాణంతో నరకం చూ స్తున్నాం. పరిమితికి మించి బస్సుల్లో ప్రయాణికులను చేరవేస్తున్నారు. సడెన్‌గా బస్సుకు ఏదైన అడ్డువచ్చిన సమయంలో డ్రైవర్ బ్రేక్ వేసిన సమయంలో గాయాలపాల వుతున్నాం. కిక్కిరిసిన బస్సు ప్రయాణం చేయాలంటే భయమేస్తుంది.

ఆర్టీసీ బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పించాలి

బెల్లంపల్లి, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అలాగే బస్ డిపో ఏర్పాటు చేయాలని ఎంసీపీఐయు జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేశ్‌లు అన్నారు. మంగళవారం ఎంసీపీఐయు ఆధ్వర్యంలో నాయకులతో కలిసి బస్టాండ్ పరిసరాలను పరిశీలించి మాట్లాడారు. బ స్టాండ్‌కు వచ్చే ప్రయాణికులకు ఆర్టీసీ అధికారులు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడం సరైందికాదన్నారు. బస్టాండ్‌లో నీటి సౌకర్యం కో సం బాత్‌రూంలు అపరిశుభ్రంగా ఉంటున్నాయని పేర్కొన్నారు. బస్టాండ్ ఆవరణలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో వీధిలైట్లు రావడం లేదని బ స్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అ లాగే ఎన్నికల్లో ఎమ్మెల్యే బెల్లంపల్లిలో బస్‌డిపోను ఏర్పాటు చేస్తానని హా మి ఇచ్చారని అమలు చేయాలని పేర్కొన్నారు. బస్టాండ్ సమస్యలు పరి ష్కరించని యెడల డిపోమేనేజర్ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోలన చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో రమేశ్, రామకృష్ణలు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

బెల్లంపల్లి, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో డిసెంబర్ 10, 11 తేదీల్లో జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు చరణ్ అన్నారు. మంగళవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జూనియర్ కళాశాలలో ఆహ్వాన సంఘం పోస్టర్లను విడుదల చేశారు. కేం ద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంపై అవలంభిస్తున్న విధానాలకు వ్యతిరే కంగా రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి కృషి చేసే విధంగా చర్యలు తీసుకోవాల ని డిమాండ్ చేశారు. స్కాలర్‌షిప్, ఫీజురియింబర్స్‌మెంట్ బకాయిలు, హా స్టల్ విద్యార్థులకు కాస్మోటిక్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరా రు. రాష్ట్ర మహాసభలను యువకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పా ల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అం జన్న, రాజు, తేజ, ప్రవీణ్, సంపత్, పాల్గొన్నారు.

బురద రోడ్డుపై స్థానికుల నిరసన

కాసిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్కేపల్లిలో ని నడిమిగూడెంలో మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో బురదరోడ్డుపై ని ల్చుని స్థానికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం గ్రామ కార్య దర్శి జంగుబాయి మాట్లాడుతూ నడిమిగూడెంలో ఇటీవల కురిసిన వర్షాని కి రోడ్డంతా బురదయంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా రన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నా ఆదివాసీ గూడాల్లో మాత్రం ఎలాంటి మౌలిక సదుపాయాలు కల్పించడం లేదన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆదివాసీ గూడాల్లోని అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయ న్నారు. దీంతో నడక నరకప్రాయంగా మారిందన్నారు. వెంటనే ఆదివాసీ గూడాల్లోని రోడ్లను బాగు చేయాలని డిమాండ్‌చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు ఆత్రం సుజాత, అర్క రాంబాయి, ఆత్రం మణి, పుతు లుబాయి, మారు, రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

హాజీపూర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : ముల్కలలో టీజీ సాట్, టీజీ హెచ్‌ఎం అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మండలం లోని విద్యార్థుల కోసం ఉపన్యాసం, వ్యాసరచన, టాలెంట్ టెస్ట్ పోటీలు ని ర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంఈవో పోటు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ అవకాశాన్ని అన్ని విద్యార్థు లు సద్వినియోగం చేసుకుని, రానున్న జిల్లా స్థాయి పోటీల్లో మండలాని కి ప్రాతినిధ్యం వహించి రాష్ట్రస్థాయిలో పేరు ప్రఖ్యాతులు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం విజేతలకు ప్రశంసా పత్రాలను అంద జేశారు. ఉపన్యాస పోటీలో జి. శ్రీవిద్య (సబ్బపల్లి ఉన్నత పాఠశాల), వ్యా సరచన పోటీలో సిహెచ్. అర్చన (సబ్బపల్లి ఉన్నత పాఠశాల), టాలెంట్ టెస్టులో ఈ. రిషిత (ముల్కల ఉన్నత పాఠశాల) విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ముల్కల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. రాజేశం, దొనబండ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరుణాకర్, సబ్బేపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధారాణి పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ ఏరియా ఇన్‌చార్జి సెక్రటరీగా శ్రీనివాస్

జైపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకే1ఏ ,ఐకే ఓసీపీ ఐఎన్‌టీయూసీ ఏరియా ఇన్‌చార్జీ సెక్రటరీగా పెట్టెం శ్రీనివా స్‌ను నియమించినట్లు యూనియన్ కేంద్ర సీనియర్‌ఉపాధ్యక్షుడు శంకర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మినిమమ్ వేజ్‌బోర్డు సభ్యుడు, ఐఎన్‌టీయూసీ జనరల్‌సెక్రటరీ జనక్‌ప్రసాద్ మంగళవారం శ్రీనివాస్‌కు నియామక పత్రం అందించినట్లు తెలిపారు, ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, గరిగె స్వామి, ఏనుగు రవీందర్‌రెడ్డి, భీమన్న, మధు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్ర

జైపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా రసూల్‌పల్లిలోని శ్రీ శివపంచాయతన సంతాన మారుతి దేవాలయం నుంచి జైపూర్ వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు హనుమాన్ శోభా యాత్రను ఘనంగా నిర్వహించారు. మహిళలు కోలాటాలతో నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో కళాకారుల సంఘం అధ్యక్షుడు వెంకటచారి, ఆంజనేయ స్వామి ఆలయం అధ్యక్షుడు కనుకుంట్ల శ్రీనివాస్, అరవింద్ రావు, లచ్చన్న, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కొర్రమట్టల ప్రాజెక్టుకు మోక్షమెప్పుడో..?

(3వ పేజీ తరువాయి)

ద్వారా వాటి సంఖ్యను మరింతగా పెంచి, ప్రజలకు అందుబాటులోకి తేవా లని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కొర్రమట్టతోపాటు ఆ జాతికే చెందిన బురద మట్టలు, చేపల విత్తన కేంద్రం, వాటి పెంపకానికి అవసరమైన హేచ రీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రాజెక్టు ద్వారా ఉత్పత్తయ్యే పిల్లలను రాష్ట్ర వ్యాప్తంగా చేపల పంపిణీ పథకానికి వినియోగిస్తారు. కొర్ర మట్ట పిల్లలను అస్తమా వ్యాధిగ్రస్తుల కోసం మృగశిర కార్తెలో పంపిణీ చేసే చేప ప్రసాదంలో వాడ తారు. ప్రాజెక్టులో పెంచిన కొర్రమట్టలను ప్రజలు వినియో గించేందుకు వీలుగా మార్కెట్లలో అందుబాటులో ఉంచడంతోపాటు, రాష్ట్ర అవసరాలు పో ను మిగిలిన వాటిని ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి చేయాలని ప్రణాళి కలు తయారు చేశారు. అయితే ప్రాజెక్టుకు రూపకల్పన జరిగి ఏడాది గడుస్తు న్నా అది కార్యరూపం దాల్చలేదు.

క్రీడాకారులు లక్ష్యంతో ముందుకు సాగాలి

దండేపల్లి నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు లక్ష్యంతో ముందుకు సాగాలని దండేపల్లి మండల ఇన్‌చార్జి విద్యాధికారి మంత్రి రాజు కోరారు. మండలంలోని రెబ్బనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదనంలో మంగళ వారం ఎస్‌జీఎఫ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయి అండర్ 14 విభాగం బా లుర వాలీబాల్ ఎంపిక పోటీలను నిర్వహించారు. పోటిలో ఆదిలాబాద్, నిర్మ ల్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల వాలీబాల్ బాలుర జట్టు పాల్గొన్నాయి. ఎంఈవో మాట్లాడుతూ క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. టోర్న మెంట్‌లో ప్రథమ స్థానంలో మంచిర్యాల జిల్లా నిలువగా, రెండవ స్థానంలో ఆదిలాబాద్ జట్టు, మూడవ స్థానంలో నిర్మల్ జట్టు విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో టోర్నమెంట్ అబ్జర్వర్ ఫిసికల్ డైరెక్టర్ ఫణిరాజు, పోటీల నిర్వ హణ కార్యదర్శి శ్రీనివాస్, పీఈటీలు పీడీలు కార్తీక్, సత్యనారాయణ, మనోహ ర్, కోచ్ కార్తీక్, రవిందర్, గ్రామ నాయకులు అశోక్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

బెల్లంపల్లి, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపాలిటి ప్రజలు ప్రభుత్వం నిర్మించిన రెండు పడకల ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహ సీల్దార్ క్రిష్ణ అన్నారు. మంగళవారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుం బాలు ఈనెల 6 నుంచి 16వ తేదీ లోగా మీ సేవా ద్వారా దరఖాస్తు చేసుకో వాలన్నారు. దరఖాస్తు దారులు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కుల ధృవీకరణ ప త్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఇతర ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రైతులు సేంద్రియ సాగుపై దృష్టి సారించాలి

జిల్లా వ్యవసాయాధికారి సురేఖ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి సురేఖ

హాజీపూర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : రైతులు సేంద్రియ సాగు పై దృష్టిసారించి భూసారం పెంపొందించే చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి సురేఖ అన్నారు. మండలంలోని గుడిపేట రైతు వేదికలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ మంగళవారం నిర్వహించా రు ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి హాజరయ్యారు. ఈ సందర్భంగా భూసార పరీక్ష ఫలితాలను రైతులకు అందజేశారు. సా యిల్ హెల్త్ కార్డులను రైతులకు అందించి, భూసార పరీక్షల ప్రాము ఖ్యతపై రైతులకు అవగాహన కల్పించారు. సురేఖ మాట్లాడుతూ స మగ్ర ఎరువుల యజమాన్యం ద్వారా భూమిలో స్థూల ,సూక్ష్మ పోష కాల సమతుల్యను కాపాడుకోవాలని భూమి తేమ నిల్వ ఉండాలంటే సేంద్రియ ఎరువులు, పశువుల ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, వాన పాముల ఎరువులు వాడటం అవసరమని సూచించారు. పచ్చి రొట్ట, జీవన ఎరువులు వాడకాన్ని పెంచితే రసాయన ఎరువుల వినియో గా న్ని తగ్గించవచ్చు అని పేర్కొన్నారు. ఆజోస్పిరిల్లం, అజాటో బ్యాక్టర్ వంటి బయో-ఫర్టిలైజర్లను రెండు కిలోల చొప్పున వాడడం వలన న త్రజని ఎరువులను 10 శాతం తగ్గించవచ్చని తెలిపారు. నత్రజని ఎ రువులు వేసేటప్పుడు మూడు నుంచి నాలుగు దఫాలుగా వేయడం అవసరమని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ మామిడి కృష్ణ, గోపి, ఏఓలు కృష్ణ, తరుణ్, పర్వీన్, ఏఈఓ ప్రసన్న, రైతు ఉత్ప త్తిదారుల సంఘం చైర్మన్ పుస్కూరి శ్రీనివాస్‌రావు, బొడ్డు శంకర్, దొమ్మటి సత్తయ్య, రాజమౌళి, ఆకిరెడ్డి రాజయ్య, అప్పని సత్తి, భూ మయ్య, పోచయ్య, పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల నిరసన

బెల్లంపల్లి ,నవంబరు4(ఆంధ్రజ్యోతి): విధుల్లో ఉన్న మున్సిపల్ అ ధికారులపై నవీన్ అనే వ్యక్తి అసభ్యకరంగా మాట్లాడారని పేర్కొం టూ మంగళవారం మున్సిపల్ కార్యాలయం ముందు మున్సిపల్ సి బ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువు రు మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌తో పాటు ఎ గ్జిక్యూటివ్ ఇంజనీర్ సాయికిరణ్ ఉన్నారన్నారు. ఈసమయంలో నవీన్ అనే వ్యక్తి లాయర్‌ని అని చెప్పి అనుమతి లేకుండా కమిషనర్ కార్యా లయంలోకి చొరబడ్డాడన్నారు.

కమిషనర్‌తో నవీన్ అనే వ్యక్తి సీఎస్ఐ పాఠశాల కాంపౌండ్‌వాల్ ఎలా కూలగొడతారని అసభ్య పదజాలంతో దూషణలకు దిగాడన్నా రు. దీంతో స్థానిక పోలీసు స్టేషన్‌లో నవీన్‌పై ఫిర్యాదు చేశామన్నారు. ఈ సంఘటనను ఖండిస్తూ పునరావృతం కాకుండా మున్సిపల్ కా ర్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఉద్యోగులు

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

భీమారం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని డీఈవో యాద య్య పేర్కొన్నారు. మంగళవారం భీమారంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేకుర్తి రాంబాయి-రాజారెడ్డిల స్మారకార్థం వారి కుమారుడు చేకుర్తి సత్యనారాయణరెడ్డి సరోజల నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ఖోఖో పోటీలను డీఈవో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మస్థైర్యంతో క్రీడ ల్లో రాణించాలన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా క్రమ శిక్షణ పెరగడంతోపాటు మంచి భవిష్యత్ ఉంటుంద న్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి దాదాపు 1600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో అండర్ 14 బాలికల విభాగంలో మందమర్రి మహా త్మాజ్యోతి బాపూలే విద్యార్థులు ప్రథమ స్థానం, చెన్నూరు రెసిడెన్షి యల్ స్కూల్ రన్నర్‌గా నిలిచింది. అండర్ 17 బాలికల విభాగంలో నీల్వాయి జిల్లా పరిషత్ పాఠశాల విజేతగా నిలిచింది. డీఈవో బహుమతులు అందించారు. ఆర్గనై జింగ్ సభ్యులు చేకుర్తి సత్యనారాయణరెడ్డి, సరోజ, తహ సీల్దార్ సదానందం, ఎస్ఐ శ్వేత, ఎంపీడీవో మధుసూ దన్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి యాకూబ్, పీడీ రామ య్య, రామ్మోహన్‌రావు, ఉమ్మడి జిల్లాగేమ్స్ సెక్రటరీ రా జయ్య, శ్రీనివాస్, లింగన్న, మల్లేష్, జ్యోతి, వహీదా, పీ ఈటీ పున్నం, ఆర్గనైజింగ్ మెంబర్లు తిరుపతి, అజయ్, రాజన్న, అమర్‌సింగ్ పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈవో,అతిథిలు

ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేలా చూడాలి

జైపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రి ల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి అనిత పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆరోగ్య కేం ద్రంలోని వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వ హించారు. ఆమె మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు తమ పరిధి లోని గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి వైద్య సేవలందించడంలో ముందుండాలన్నారు. ప్రతి గర్భిణీ వివరాలను నమోదు చే యించాలని, టీకాలను ఇప్పించాలని, 102 సర్వీసు ద్వారా స్కా నింగ్‌కు తీసుకువెళ్లాలన్నారు. సాధారణ ప్రసవాలను ప్రోత్స హించాలని, సిజేరియన్లు లేకుండా చూడాలని, హైరిస్కు కేసు లను వైద్యాధికారి తెలియజేయాలన్నారు. ఏఎన్ఎంలు పిల్లలకు టీకాలను సకాలంలో అందించాలన్నారు. వ్యాధులు ప్రబలకుం డా గ్రామపంచాయతీ సిబ్బంది సహకారంతో చర్యలు చేపట్టా లన్నారు. ప్రజలకు వ్యాధుల గురించి, పరిసరాల పరిశుభ్రత గు రించి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యు డు వంశీకృష్ణ, సీహెచ్‌వో పద్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అనిత

విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు

కోటపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీశాట్ ఆధ్వర్యంలో మంగళ వారం విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. సమకాలీన, విషయ పరిజ్ఞానం అంశాల్లో విద్యార్థులకు ఉపన్యా సం, వ్యాసరచన, క్విజ్ పోటీలు ఏర్పాటు చేశారు. మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు జిల్లా స్థాయి లో పాల్గొంటారని ఎంఈవో మొగిలి తెలిపారు. విజేత విద్యా ర్థులకు ప్రశంసా పత్రాలు అందించారు.

ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం కృష్ణమూర్తి, ఉపా ధ్యాయులు పాల్గొన్నారు.

'అమ్మకు అక్షరమాల'ను విజయవంతం చేయాలి

కోటపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు ఉద్దేశించిన ఉల్లాస్ కార్యక్రమంలోని అమ్మకు అక్షరమాల కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వయోజన శాఖ అధికారి అజ్మీర పురుషోత్తం నాయక్ అన్నారు.

మంగళవారం మండల కేంద్రంలో గ్రామైక్య సంఘాల మహిళలకు, ఓబీల కు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిరక్షరాస్యుల ను గుర్తించి వారికి చదువు నేర్పించేందుకు వలంటీర్లను గుర్తించి ఉల్లాస్ యాప్‌లో నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి గ్రామ సంఘం నుంచి ఇద్దరు ఓబీలకు, వీవోఏలకు శిక్షణ పొందిన సీఆర్‌పీలు శిక్షణ కార్యక్ర మాన్ని నిర్వహిస్తున్నారన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకుని అక్షర కేంద్రాల ద్వారా అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మొగి లి, ఏపీఎం ఉమారాణి, సీఆర్‌పీలు తిరుమల, అమీనా, డీఆర్‌పీ సుమన్, సె ర్ప్ సిబ్బంది, ఎంఎస్ ఓబీలు, వీవోఏలు పాల్గొన్నారు.

ఆధునిక సాగు పద్ధతులతో అధిక దిగుబడులు

రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు

నెన్నెల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక పద్ధతులతో పంటల సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వరంగల్ ప్రాంతీయ పరిశోధన స్థానం, బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శా స్త్రవేత్తలు పేర్కొన్నారు. మంగళవారం నెన్నెల, కన్నెపల్లి మండ లాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. వరం గల్ పరిశోధన స్థానంలో నూతనంగా రూపొందించిన డబ్ల్యూ జీ సీవీ-బీజీ-26 రకం పత్తి రకాన్ని ప్రయోగాత్మకంగా సాగు చేస్తు న్న కె. రాజమౌళి (బొప్పారం), టి. నాగేశ్వర్(దాంపూర్)ల పంట చేలను పరిశీలించారు. అనంతరం అధిక సాంద్ర పద్ధతిలో సాగు చేసిన పత్తి పంటచేలను సందర్శించారు. ఈ సందర్భంగా రైతుల కు సలహాలు, సూచనలిచ్చారు. అధిక సాంద్రత విధానంలో పత్తి సాగు చేస్తే అత్యధిక లాభాలు పొందవచ్చని అన్నారు. ఈ విధా నంతో పత్తిని రెండు, మూడు సార్లు కాకుండా ఒకే సారి ఏరుకో వచ్చన్నారు.

తొందరగా పంట చేతికి రావడంతో వెంటనే కూర గా యలు సాగు చేసుకొని అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. వ రంగల్ ప్రాంతీయ పరిశోధన స్థానం పత్తి ప్రధాన శాస్త్రవేత్త డా క్టర్ జి. వీరన్న, ప్లాంట్ బ్రీడర్ డాక్టర్ ప్రశాంత్, బెల్లంపల్లి కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్. మహేష్, నాగరాజు, మండల వ్యవసా య అధికారి పుప్పాల సృజన ఉన్నారు.



బొప్పారంలో అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేసిన పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

మంచిర్యాల

జిల్లా వార్తలు

3

బుధవారం 5 నవంబరు 2025

పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

చెన్నూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరులో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన అన్‌వెల్ స్టూడెంట్ పోటీల్లో మండలంలోని పొక్కూరు జిల్లా పరిషత్‌సెకండరీ పాఠశాల విద్యార్థు లు ప్రతిభ కనబర్చినట్లు ఎంఈవో దత్త కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాస రచన పోటీల్లో విద్యార్థిని శ్రీనిషా, క్విజ్ పోటీల్లో హర్షిణి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు.

కమిషనర్ వేధింపులతో వెళ్లిపోయిన చిరు వ్యాపారులు

చెన్నూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు మున్సిపల్ కమిషనర్ వేధింపులు భరించలేక మున్సిపాలిటీ పరిధిలో దుప్పట్లు, చెద్దర్లు, స్వెట్టర్లు అ మ్ముకునే చిరు వ్యాపారులు వెళ్లిపోయారని బీఎంఎస్ జిల్లా కార్యదర్శి రాజు యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ బతుకుదెరువు కోసం మధ్యప్రదేశ్ నుంచి వలస వస్తే వారిని మున్సిపల్ కమిషనర్ డబ్బులు ఇవ్వాలని లేదంటే వ్యాపార సామగ్రిని జేసీబీతో చెత్త డంపింగ్ యార్డుకు తరలిస్తానని చెప్పాడన్నారు. చేసేదేం లేక వ్యాపారులు చెన్నూరు వదిలి వెళ్లిపోయారన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిల పక్ష సమావేశాలు ఏర్పాటు చేసి కేంద్రంపై ఒత్తిడి పెంచాలని వారు డిమాండ్ చేశారు. నాయకులు శ్రీరామోజు కొండయ్య, రంగు రాజేశం, జయరావు, షబ్బీర్ పాషా, యాదగిరి, రాజు, రమేష్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వరిధాన్యం కొనుగోలు కోసం పూర్తిస్థాయి ఏర్పాట్లను చేశామని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాగ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 150, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో 97, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 63, మెప్మా ఆధ్వర్యంలో 7 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రైతులు కొనుగోలుకేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు.

కొర్ర మట్టల ప్రాజెక్టుకు మోక్షమెప్పుడో..?



ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద కేటాయించిన భూమి

- జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి రూపకల్పన
- ఏడాది గడుస్తున్నా ఊసెత్తని సర్కారు
- రూ. 15 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళిక
- స్థలం కేటాయించినా పట్టాలెక్కని ప్రాజెక్టు

మంచిర్యాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లాలో కొర్ర మట్టల (మంచినీటి చేపలు) పెంపకం కోసం ఏర్పాటు చేయదలచిన భారీ ప్రాజెక్టుకు ఏడాది గడుస్తున్నా మోక్షం కలగడం లేదు. మంచిర్యాల జిల్లా గుడిపేటలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద భారీ ప్రాజెక్టుకు రూపకల్పన చేయడం ద్వారా కొర్రమట్ట (కొర మీను) చేపలను పెంచాలని రాష్ట్రప్రభుత్వం గతేడాది నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ. 15 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టబోయే ప్రాజెక్టు కోసం రెవెన్యూ శాఖ ఎల్లంపల్లి ప్రాజెక్టు సమీపంలో 30 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. రాష్ట్రంలోనే తొలిసారిగా చేపట్టదలచిన ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్)కి చెందిన మంచినీటి చేపల పెంపకం సంస్థ అయిన సీఐ ఎఫ్ఏ (సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్రెష్ వాటర్ ఆక్వా కల్చర్) సాంకేతిక సహకారంతో స్థాపించేందుకు సన్నాహాలు చేసింది. ప్రాజెక్టు కోసం అవసరమైన ప్రతిపాదనలు సమర్పించగా కేంద్ర ప్రభుత్వం గతేడాది అక్టోబరు నెలలో ఆమోదం కూడా తెలిపింది. త్వరలోనే ప్రాజెక్టు కార్యరూపం దాల్చనుందని మత్స్యశాఖ అధికారులు ప్రకటించగా, ప్రభుత్వం ఇప్పటి వరకు తిరిగి ఆ ఊసే ఎత్తకపోవడంతో అడుగులు ముందుకు పడలేదు.

ప్రజల్లో డిమాండ్..

ప్రజలు అమితంగా ఇష్టపడే కొర్రమట్ట చేపను దక్షిణ తెలంగాణలో బొమ్మె చేపగా కూడా పిలుస్తారు. పొడవుగా ఉండి, చదునైన శరీరాన్ని కలిగి ఉండే కొర్రమ ట్టకు పోషకాల గనిగా పేరుంది. ప్రస్తుతం మార్కెట్లో కిలో 600 రూపాయల వరకు ధర పలుకుతోంది. ఈ చేపకు ప్రజల్లో మంచి డిమాండ్ ఉండగా, దీన్ని తినేందుకు ఎగువ మధ్యతరగతి, సం పన్నులు అమితంగా ఇష్టపడతారు. కాగా కొర్రమట్టను 2016లో అప్పటి ప్రభుత్వం రాష్ట్ర చేపగా గుర్తించింది. ఈ రకం చేపల జాతిని కాపాడటం..

(తరువాయి 5లో)



కొర్రమట్టల పెంపకం కోసం భూమి పత్రాలు అప్పగిస్తున్న రెవెన్యూ అధికారులు (ఫైల్)

మత్స్యకారుల ఉపాధి కోసమే చేప పిల్లల పంపిణీ

కలెక్టర్ కుమార్ దీపక్



గుల్లకోట గోదావరి నదిలో చేప పిల్లలను వదులుతున్న కలెక్టర్

లక్షెట్టిపేట, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): ప్రభు త్వం మత్స్యకారుల సంక్షేమం కోసం వాళ్లకు ఉపాధి కల్పించడం కోసమే చేప పిల్లల పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం లక్షెట్టిపేట మండలంలోని గుల్లకోట గ్రామ గోదావరి నదిలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య, మత్స్యశాఖ అధికారి అవినాష్‌తో కలిసి చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమం కోసం ఈఏడాది సుమారు 22,393 లక్షల చేపపిల్లలను ఇవ్వడం కోసం ప్రతిపాదన సిద్ధం చేశామన్నారు. మన జిల్లాలో సుమారు 380 చెరువులు రిజర్వాయిర్లు ఉన్నాయని ఇవే కాకుండా 369సీజనల్ చెరువులు ఉన్నట్లు వాటికి అనుగుణంగా చేప పిల్లలను వదులుతామన్నారు. అనంతరం ఇదే గ్రామంలో లక్ష్మి ప్రసన్న గ్రామ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులు, నాయకులతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో కలెక్టర్ వెంట లక్షెట్టిపేట తహసీల్దార్ దిలీప్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్‌చంద్, వైస్ చైర్మన్ ఆరీఫ్, పాల్గొన్నారు.

యూడైస్‌లో వివరాలు నమోదు చేయాలి

మందమర్రిరూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : యుడైస్‌లో వివరాలను సరిగ్గా నమోదు చేయాలని సెక్టోరియల్ అధికారి భరత్‌కుమార్‌సూచించారు. మంగళవారం మండలంలోని ఆదర్శ పాఠశాలలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యుడైస్ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ ఉండాలన్నారు. తప్పులు లేకుండా వివరాలను నింపాలన్నారు. మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు రాజ్ కుమార్, ఎంఈవో దత్తుమూర్తి పాల్గొన్నారు.

బస్సు ప్రమాద మృతులకు నివాళి

భీమారం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల బస్సు ప్రమాదంలో మృతిచెందిన వారికి మంగళవారం భీమారంలోని బస్టాండ్ వద్ద భీమారం ఎస్ఐ శ్వేత, పోలీసులు, గ్రామస్థులు నివాళులర్పించారు. బస్సు ప్రమాదం బాధకరమని, 20 మంది మృతిచెందడం అందర్నీ కలిచివేసిందన్నారు.

ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోళ్లు చేపట్టాలి

కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోళ్లు చేపట్టాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ సమావేశ మందిరంలో అధికారులు, జిన్నింగు మిల్లుల యాజమానులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం సీసీఐ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుంచి పత్తి కొనుగోలు చేస్తుందన్నారు. ప్రభుత్వం ప్రారంభించిన కపాస్ కిసాన్ యాప్‌లో రైతులు తమ వివరాలను నమోదు చేసుకుని పత్తి విక్రయానికి స్లాట్ బుక్ చేసుకునే విధంగా అధికారులు రైతులకు అవగాహనకల్పించాలన్నారు. ఈసారి ఎల్ 1, 2, 3 స్థాయిల్లో స్లాట్ బుకింగ్ ఉంటుందని, ఎల్ 1లో 75 శాతం స్లాట్ బుకింగ్ తర్వాత ఎల్ 2 ఓపెన్ అవుతుందని, ఎల్2లో 75 శాతం అయిన తర్వాత ఎల్ 3 ఓపెన్ అవుతుందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. లక్షెట్టిపేట, బెల్లంపల్లి, తాండూర్ ప్రాంతాల్లో కొనుగోలుకేంద్రాలను త్వరగా ఏర్పాటుచేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. దళారులు కొనుగోలు చేసిన పత్తిని కొనుగోలు కేంద్రాల్లోకి అనుమతించవద్దన్నారు. జిల్లా వ్యవసాయాధికారి సురేఖ, మార్కెటింగ్ అధికారి షహబుద్దీన్, పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలు అందించాలి

జిల్లా వైద్యాధికారి అనిత

నస్పూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలు అందించడంలో ముందుండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అనిత అన్నారు. నస్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేసి ఆశా కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణుల వివరాలను నమోదు చేయాలని, టీకాలను ఇప్పించాలన్నారు. 102 సర్వీస్ ద్వారా స్కానింగ్ కోసం తీసు కెళ్లడం, ప్రభుత్వ అసుపత్రిలో ప్రసవం చేయించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. సిజేరియన్లు లేకుండా సాధారణ ప్రసవాలకు ప్రోత్సహించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు పట్ల ప్రజలకు అవగాహన కల్పిం చాలన్నారు. ఆరోగ్య కార్యకర్తల ద్వారా అందరికీ టీకాలు ఇప్పించాలని, పిల్లల్లో పోషకార లోపంతో బాధపడుతున్న వారి వివరాలను సేకరించి నమోదు చేయాలన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని డాక్టర్ అనిత ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆశా, ఆరోగ్య కా ర్యకర్తలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కార్తీక పౌర్ణమి

ఆలయాల్లో ప్రత్యే పూజలు

కాసిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నేడు కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయాల్లో భక్తులు ప్రత్యేకపూజలు చేస్తుంటారు. ఉసిరి చెట్టు కింద దీపారాధన చేసి వన భోజనాలు చేయడం వల్ల అష్ట ఐశ్వార్యలతో పాటు ఆయురారోగ్యాలు పొందుతారని ప్రగాడ విశ్వాసం. ఈ మాసం ఎంతో పవిత్రమైందిగా బావిస్తారు. కార్తీక పౌర్ణమి రోజు అందుబాటులో ఉన్న ఉసిరి చెట్టు వద్దకు వెళ్లి భోజనాలు చేస్తారు. కార్తీకమాసంలో మహావిష్ణువు, మహాలక్ష్మీలు ఇద్దరు కొలువై ఉంటారని విష్ణు పురాణం చెబుతుంది. ఉసిరిని భూమాతగా కొలుస్తారు.

కాంట్రాక్టర్లకు బిల్లులు వెంటనే చెల్లించాలి

మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

హాజీపూర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీ, ఆసుపత్రి భవన నిర్మాణ కాంట్రాక్టర్‌కు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. గుడిపేట్‌లో నిర్మితమవుతున్న మెడికల్ కాలేజీని మంగళవారం స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా దివాకర్‌రావు మాట్లాడుతూ గుడిపేట్ శివారులో 32 ఎకరాల సువిశాలమైన స్థలంలో రూ.510 కోట్లతో ఈ కాలేజీ,450 పడ కల ఆసుపత్రి భవనాలు నిర్మాణం ప్రారంభమై ప్రస్తుతం పూర్తయ్యేదశకు వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్‌లో పెట్టడంతో ఆలస్యం అవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ బేర పద్మ పోచయ్య, శ్రీనివాస్, సరోజన, తిరుపతి, మల్లేష్, ధరణి రాంబాబు, సాయి, మురళి పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మీట్‌పై సమీక్ష సమావేశం

లక్షెట్టిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకులంలో ఈనెల 6 నుంచి నిర్వహించే 11వ జోనల్ స్పోర్ట్స్‌మీట్‌పై మంగళవారం ప్రిన్సిపల్ రమాకళ్యాణి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ సుమారు మూడు రోజుల పాటు జరిగే ఈక్రీడా పోటీల్లో 15 పాఠశాలల నుంచి 1275మంది క్రీడాకారులు పాల్గొననున్నారని అందుకు గాను ఏర్పాట్లు సిద్ధం చేస్తామన్నారు. ఒక్కో పాఠశాల నుంచి సుమారుగా 85 మంది క్రీడాకారులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసి కట్టుదిట్టమైన ఏర్పాటు చేయాలని సమీక్ష సమావేశంలో సిబ్బందిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో డీసీవో సత్రం దేవసేనతో పాటు వివిధ పాఠశాల ప్రిన్సిపల్స్ గిరిజ, యుగేంద్ర లక్ష్మి, ప్రేమారాణి, మోహన్, సంతో ష్, నాగేశ్వర్‌రావు, బాగ్యలక్ష్మి, వెంకటమ్మ, అరుణబాయి, లావణ్య, రమా దేవి, మాదవి, స్రవంతితో పాటు సీనియర్ అద్యాపకులు మహేశ్వర్ రావు, కొండల్‌రావు, గీతాంజలి, సమ్మయ్య, రాజు, రామకృష్ణ ఉన్నారు.

కళాశాలలు నడపలేకపోతున్నాం..

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించండి



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉన్నత విద్యా సంస్థల యాజమాన్యాలు

మంచిర్యాల క్రైం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఫీజు రియిం బర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయయని, ఇక కాలేజీలు నడపలేమంటూ విద్యా సంస్థల యాజమాన్యాలు మంచిర్యాల ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12 వేల కోట్ల పెట్టుబడులు పెట్టి అప్పుల ఊబిలో కూరుకుపోయామని, ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే చెల్లిస్తామన్న 900 కోట్ల ఫీజు రియింబర్స్ మెంట్ విడుదల చేయాలన్నారు. ఇప్పటికే కళాశాల భవనాలు, భూములు, బంగారాన్ని తాకట్టు పెట్టి అప్పులను తీర్చలేక, అధ్యాపకుల జీతాలు చెల్లించుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిల విడుదల కోసం రోడ్ మ్యాప్ సిద్ధం చేసి చెల్లిస్తామన్న ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రియంబర్స్‌మెంట్ చెల్లించే వరకు కళాశాలలను నడిపేది లేదని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో కళాశాలల యాజమాన్యం చంద్రమోహన్‌గౌడ్, ఉ పేందర్, నర్సయ్య, రమణ, పల్ల భూమేష్, మనోహర్‌రెడ్డి, ఆర్ శ్రీనివాస్, కళాశా లల అద్యాపక బృందాలు పాల్గొన్నారు.

వెల్గనూర్ పాఠశాలలోని స్వచ్ఛ బృందం సభ్యుల సందర్శన

దండేపల్లి నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలోని మౌలిక వసతుల కల్పన కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయం రెటింగ్స్‌పై దండేపల్లి మండలం వెల్గనూర్ ప్రభుత్వ జెడ్పి ఉన్నత పాఠశాలను బృందం సభ్యులు సందర్శించారు. పాఠశాలలోని మంచినీరు, మరుగుదొడ్లు, పాఠశాల నిర్వహణ, తదితర వసతులపై సర్వే నిర్వహించి నమోదు చేశారు. జన్నారం ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం శివరాజం మాట్లాడుతూ జాతీయస్థాయిలో ఎంపికైనా పాఠశాలలకు ప్రభుత్వం ప్రోత్సాహం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సభ్యులు రఘునాథం, ఇన్‌చార్జి ప్రధానో పాధ్యాయుడు బొలిశెట్టి రాజన్న, ఉపాధ్యాయులు ఉన్నారు.



వెల్గనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తాగునీటిని పరిశీలిస్తున్న తనిఖీ బృందం

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

గూడెం ఆలయంలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

దండేపల్లి నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గూడెం శ్రీసత్యనారాయణ స్వామి దేవాలయంలో జరిగే కార్తీక పౌర్ణమి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. మంగళవారం ఆలయాన్ని సందర్శించారు. ముందుగా కలెక్టర్‌కు సన్నాయి వాయిద్యాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం సత్యదేవుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పౌర్ణమి జాతరకు సుమారు లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నం దున ఆలయ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలీ సు బందోబస్తు, తాగనీరు, భారీకేడ్లు తదితర ప్రత్యేక ఏర్పాటు చేపట్టే విధంగా చూడాలన్నారు. ఇందుకు అధికారులు సమన్వయంతో పని చేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం కలెక్టర్‌కు ఆలయ అధికారులు సత్కరించి స్వామి వారి ప్రసాదాలు అందజేశారు.



ఆలయంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

విద్యార్థులకు చక్కటి విద్యాబోధన అందించాలి

విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో చక్కటి విద్యాబోధన అందించే విధంగా ఉపాధ్యాయులు చూడాలని కలెక్టర్ కుమార్ దీపక్ కోరారు. ద్వారక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మీకంగా తనిఖీ చేసి షెడ్యూల్ తెగల సంక్షేమ వసతి గృహ నిర్మాణ పనుల పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. పాఠశాలలో విద్యాబోధన తీరును పరిశీలించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వహణ, పరిసరాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం, పౌష్టికాహారం శుద్ధమైన తాగునీరు అందించాలన్నారు. ఆయన వెంట మండస్థాయి అధికారులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎస్టీపీపీ ఈడీకి వినతి

జైపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీ పీపీలో నూతనంగా ఎన్నికైన సీఎంవోఏఐ సభ్యులు మంగళవారం ఈడీ చిరంజీవి, జీఎంలు నరసింహారావు, మదన్ మోహన్‌లను కలిసి డిమాండ్లను పరిష్కరించాలని వినతి పత్రాలు అందించారు. సీఎంవోఏఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ పంతుల మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యానికి సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాలు ఇచ్చినా పరిష్కరించడం లేదన్నారు.

పీఆర్‌సీ బకాయిలను ఇప్పటి వరకు చెల్లించలేదని, ఇప్పటికైనా యాజమాన్యం అధికారుల సమస్యలపై సానుకూలంగా స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సంతోష్‌కుమార్, జనగామ శ్రీనివాస్, అప్పారావు, శ్రీనివాస్, రమేష్, శ్యామల, మోబిన్, ఠాకూర్ మోహన్‌సింగ్, శంకర్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మంచిర్యాల డీసీపీ భాస్కర్

లక్షెట్టిపేట, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్క వాహనదారుడు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ అన్నారు. మంగళవారం లక్షెట్టిపేట పట్టణంలోని శ్రీనివాస గార్డెన్స్‌లో లక్షెట్టిపేట పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా డీసీపీ మాట్లాడుతూ మనం నిత్యం ఎన్నో రోడ్డు ప్రమాదాలను చూస్తున్నామని వాటికి కారణం కేవలం చాలా వరకు ట్రాఫిక్ రూల్స్ పాటించక పోవడమే అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించక ప్రాణాలు వదిలిన వాళ్ల కుటుంబాలు ఎన్నో రోడ్డున పడ్డాయని క్షణం ఆలోచిస్తే మనతో పాటు మన కుటుంబీకులు కూడా సంతోషంగా ఉంటారన్న విషయం ప్రతీ ఒక్కరికి తెలియాలనే పోలీసులు ఇలాంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.

పోలీసులు పని చేస్తున్నది ప్రజల కోసమని ప్రజలు వాళ్ల కుటుంబాలు సంతోషంగా ఉండాలని కోరుకుంటూ ఎలాగైన మార్చాలన్న ఉద్దేశంతో ఎన్నో రకాలుగా రైడ్స్ చేసి ఫైన్స్ వేసిన కూడా ప్రజల్లో మార్పు రావడం లేదన్నారు. బైక్ నడిపే సమయంలో తప్పకుండా హెల్మెట్ ధరించాలని, కారు డ్రైవింగ్ చేసేటప్పుడు సీట్ బెల్టు పెట్టుకోవాలని, ఆటోల్లో ఒవర్‌లోడ్ ప్యాసిం జర్‌లను ఎక్కించుకోకూడదని అదే విధంగా స్కూల్ బస్సులు నడిపే వాళ్లు పిల్లలను జాగ్రత్తగా ఎక్కించుకోవాలని అతి వేగం, రాష్ డ్రైవింగ్ ఎట్టి పరిస్థితుల్లో చేయకూడదన్నారు. ఎట్టి పరిస్థితుల్లో మద్యం సేవించి వాహనం నడపకూడదన్నారు. వాహనాల పత్రాలు కలిగి ఉండాలని ప్రతీ ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సు తీసుకున్న తర్వాతనే వాహనాలు నడపాలన్నారు. ముఖ్యంగా తల్లి తండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. అనంతరం వాహనదారులు, డ్రైవర్లతో ట్రాఫిక్ రూల్స్ తప్పకుండా పాటి స్తామని ప్రతిజ్ఞ చేయించారు. ద్విచక్ర వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేసారు. ఈకార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి, ఎస్సై గోపతి సురేష్ పాల్గొన్నారు.



వాహనదారులతో ప్రతిజ్ఞ చేపిస్తున్న డీసీపీ భాస్కర్

పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలి

మందమర్రిరూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని ఎంపీవో సత్యనారాయణ సూచించారు. మంగళవారం మామిడిగట్టు, ఆదిల్‌పేట గ్రామాల్లో పర్యటించారు.

రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటికి తడి, పొడి చెత్తను వేరుగా సేకరించి కంపోస్టు షెడ్‌కు తరలించి వర్మీకంపోస్టు తయారు చేయాలన్నారు. రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. ఇంటి పన్నులను వంద శాతం వసూలుచేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేయరాదన్నారు. మల్టీ పర్పస్ వర్క ర్లకు ఇన్సూరెన్స్ చేయించాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, సిబ్బంది ఉన్నారు.

విశ్వకర్మలు ఆలయంలో దీపారాధన చేయాలి

నస్పూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం నస్పూర్‌లోని శ్రీ వెంకటేశ్వర దేవాలయం అవరణలోని శ్రీ పోతులూరి బ్రహ్మేశ్వరస్వామి దేవాలయంలో దీపారాధనలో విశ్వకర్మ కులస్తులు పాల్గొనాలని విశ్వకర్మ సంఘం రాష్ట్ర కార్య దర్శి కర్ణకంటి నరసింహాచారి కోరారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో మాట్లాడారు. బుధవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని విశ్వకర్మ కులస్తులు దీపారాధన కార్యక్రమం నిర్వహించాలన్నారు. కులస్తులు ఆలయం వద్దకు వచ్చి దీపారాధన చేయాలని కోరారు.

ఈ సమావేశంలో నాయకులు లింగంపల్లి విజయ్ కుమార్‌చారి, కొత్తూరి రాజమౌళి, ఉప్పుల సత్యనారాయణ, ఊట్ల చంద్రమౌళి, వసంతుల గురువయ్య పాల్గొన్నారు.